క్లుప్తంగా

వెల్లూరు పాఠశాలలో వంట సామగ్రి చోరీ


వంట గదిని పరిశీలిస్తున్న ఎంఈఓలు

నాగలాపురం: మండలంలోని వెల్లూరు ఎంపీపీ పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వంట గదిలో వున్న గ్యాస్ సిలిండర్, స్టవ్, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను చోరీ చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. ఆమె గురువారం ఉదయం ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజుతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



శ్రీకాళహస్తి: పట్టణంలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, నేతలు జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, నేతలు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్‌నాథ్, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జీపాళ్యం తేజోవతి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్, శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ విద్యార్థులు నినాదాలు చేస్తూ పట్టణ వీధుల్లో జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రాగి జావలో పోషకాలు పుష్కలం


రాగిజావ తాగుతున్న మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న రాగి జావలో అనేక పోషకాలు ఉంటాయని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన గురువారం పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి రాగిజావ తాగారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంగళ, గురు, శనివారాలు రాగిజావను ఇంటర్వెల్ సమయంలో అందిస్తున్నామని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి


డాక్టర్ రామచంద్రన్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

నాగలాపురం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లత, డాక్టర్ రామచంద్రన్ సూచించారు. కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ రామచంద్రన్‌ను ప్రిన్సిపల్ లత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుసూదన్, వేలాయుధం, శ్రీనివాసులు, హరినాథ్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో స్వచ్ఛ అభయాన్


మొక్క నాటుతున్న తుడా చైర్మన్

రేణిగుంట: సీఆర్ఎస్‌లో గురువారం స్వచ్ఛ అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సీఆర్ఎస్ ఆవరణలో వర్క్‌షాప్ మేనేజర్ దేవసహాయం, ఉద్యోగులతో కలసి మొక్కలు నాటారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ యూనియన్ కార్యాలయాలకు వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఆర్ఎస్ ఉద్యోగులు, వివిధ రైల్వే ఉద్యోగ సంఘం నేతలు దివాకర్‌రెడ్డిని సత్కరించారు.

బాబు పాలనకు చరమగీతం పాడుదాం


నాగనందాపురంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్


నాగనందాపురంలో నూతన ఆలయ కుంభాభిషేక వేడుకల్లో నూకతోటి రాజేష్, నేతలు

వరదయ్యపాళెం: అధికారం కోసం చంద్రబాబు నాయుడు అండ్ కో వందల హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అలాంటి మోసపూరిత చంద్రబాబు పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం నాగనందాపురంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీబీటీ ద్వారా సంక్షేమాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి ఏమైందని, అన్నదాత సుఖీభవ కొందరికేనా?, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కుంభాభిషేకంలో నూకతోటి

నాగనందాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకల్లో నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, దామోదర్‌రెడ్డి, మునస్వామి యాదవ్, విజయ్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కార్యదర్శి శోభన్ యాదవ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దుద్దు వేణు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేంద్ర, ప్రచార నియోజకవర్గ అధ్యక్షుడు శివాయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గిరి, మస్తాన్, ఈశ్వరయ్య, దినేష్, రమేష్, రాధాకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు


పిరమిడ్స్ రిహార్సల్స్ చేస్తున్న విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం చేసిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల పిరమిడ్స్ విన్యాసాలను రిహార్సల్స్ చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

శ్రీకాళహస్తి: రైతు సంక్షేమమే ఎన్డీయే కూటమి ధ్యేయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో భాగంగా వందలాది ట్రాక్టర్లతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఊరందూరు నుంచి ఏపీ సీడ్స్, నాలుగు మాడ వీధుల గుండా సాగింది. అంతకుముందు జరిగిన సమావేశంలో ముందుగా మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి మృతికి ఆయన నివాళులర్పించారు. రైతులు పాల్గొన్నారు.

100 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ



నాగలాపురం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం నాగలాపురం అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్, ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ సునీల్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ టవర్ క్లాక్ కూడలి వరకు సాగింది. అక్కడ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పాఠశాలకు బల్లల వితరణ


బ్యాంకు అధికారులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు శ్రీకాళహస్తి శాఖ రూ.లక్ష విలువ చేసే విద్యార్థులు కూర్చునే బల్లలను సీఎస్ఆర్ పథకం కింద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎంతో మంది దాతలు పాఠశాలకు ఎన్నో రకాలుగా సహాయం చేస్తుంటారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. హెచ్‌ఎం తీగల వెంకటయ్య, బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా అనంతరం కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 5, 6, 7వ తరగతి చదివే ఆరుగురు పేద విద్యార్థులకు రూ.3వేలు చొప్పున, అదే విధంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.5వేలు చొప్పున నగదు ఇచ్చారు.

పూజా సామగ్రి పంపిణీ


అర్చకులకు పూజా సామగ్రి పంపిణీ చేస్తున్న ఆనంద్‌రెడ్డి

రేణిగుంట: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని మండలంలోని 25 శ్రీకృష్ణ దేవాలయాలకు యాదవ హక్కుల పోరాట సమితి, యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం రేణిగుంట వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి చేతుల మీదుగా పూజాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమశేఖర్, వీఆర్ రావణ, లోక యాదవ్, చందు, శ్రీరామ్ యాదవ్, రాజ్ కిషోర్, చంగ్రాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల వితరణ


విద్యార్థులతో దాతలు

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం హైస్కూల్ విద్యార్థులకు అదే పాఠశాలలో చదువుతున్న తనూజ తల్లిదండ్రులు వినోద్, నాగమణి గురువారం ఐడీ కార్డులు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతల సహకారం మరువలేనిదని తెలిపారు. వారి స్ఫూర్తితో ఉత్తమ ఫలితాల సాధన దశగా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుష్యంత్ రెడ్డి, వెంకటరమణ, మీరయ్య, మునెమ్మ, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, కుమార్, శ్రీనివాసులు, మనోహర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ రవీంద్ర, హాజరైన ఇంజినీరింగ్ విద్యార్థులు

నారాయణవనం: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేఖర్ హెచ్చరించారు. వారు గురువారం స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. 25 సంవత్సరాలు కష్టపడి బాగా చదువుకుంటే మిగిలిన జీవితమంతా ఆనందంగా జీవించవచ్చన్నారు. ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి వినియోగంపై వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాళ్లు జనార్దనరాజు, మధు, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా తమిళనాడుకు మట్టి తరలింపు


కన్నావరంలో ఆగిన టిప్పర్లు

సత్యవేడు: మండలం నుంచి తమిళనాడుకు గ్రావెల్, మట్టి తరలింపు మళ్లీ మొదలైంది. రెండు రోజులుగా సత్యవేడు, నాగలాపురం మండలాల నుంచి టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి క్వారీ లారీలను ఆపించడంతో అందరూ స్వాగతించారు. రెండు నెలలు మట్టి తరలింపు ఆగిపోయింది. రెండు రోజుల నుంచి మళ్లీ మట్టిని నాగలాపురం గోళ్లవారికండ్రిగ నుంచి కన్నావరం మార్గంలో తమిళనాడుకు తరలింపు మొదలైంది. ఇప్పటికే తారు రోడ్లు మట్టి రోడ్లుగా మారాయని, మళ్లీ లారీలు పెద్ద ఎత్తున తిరగడం వల్ల ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి వుండదని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో కన్నావరం వాసులు గురువారం టిప్పర్లను అడ్డుకున్నారు.

మృతుడికి నివాళి

సత్యవేడు: మదనంబేడులో విద్యుత్ షాక్‌కు గురై షణ్ముగం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం మదనంబేడు చేరుకున్నారు. షణ్ముగం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని తండ్రి వేలాయుధం, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు నగదు ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

ఐజర్.. త్రివర్ణ శోభితం


ఐజర్‌లో త్రివర్ణ విద్యుత్ వెలుగులు

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లి సమీపంలోని తిరుపతి భారతీయ శాస్త్ర, పరిశోధన సంస్థ(ఐజర్) ప్రాంగణం స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని త్రివర్ణ శోభిత విద్యుత్ జిలుగులతో వెలిగిపోతోంది. ఐజర్ ప్రధాన పరిపాలన భవనంతోపాటు, ఐజర్ ప్రాంగణమంతా త్రివర్ణ విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఐజర్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో శుక్రవారం జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని యువతరం సేవాసమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రుయా ఆస్పత్రిలో రక్తనిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో వారి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: మత్తు పదార్థాలకు దూరంగా ఉందామని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రెండవ పట్టణ సీఐ నాగార్జున రెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా

నారాయణవనం: గ్రామాల్లో మెరుగైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం పాలమంగళంలో అరణ్యంకండ్రిగ సబ్‌స్టేషన్ నుంచి పాలమంగళం ఫీడర్‌లోని గ్రామాలకు ఆర్డీఎస్ఎస్ పథకం కింద నిర్విరామ త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు త్వరలో త్రీఫేజ్‌లో మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ దేవా ఆశీర్వాదం తెలిపారు. జెడ్పీటీసీ సుమన్, ట్రాన్స్‌కో ఏడీ శంకరయ్య, ఏఈ ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ అరుణ, ట్రాన్స్‌కో ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

రేణిగుంట: డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటాపురం సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్బన్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ జయచంద్ర, ఎస్‌ఐ నాగరాజు, ట్రైనీ ఎస్‌ఐ స్వాతి పాల్గొన్నారు.